


సహస్ర తులసీదళార్చన

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



కక్షసాధింపు రాజకీయాలు వద్దు

వైఎస్సార్‌సీపీ నాయకుడి వ్యవసాయ భూమిలో కొబ్బరి మొక్కలను, జీడి చెట్లను ధ్వంసం చేయడంపై మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ధ్వజమెత్తారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

33.0/27.0

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

యూపీహెచ్‌సీని పరిశీలించిన టాస్క్‌ఫోర్స్ బృందం



యూపీహెచ్‌సీలో రోగుల రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృంద వైద్యురాలు లూసీ కార్డిలియా

అనకాపల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు పట్టణంలోని గవరపాలెంలో అరుంధతినగర్ యూపీహెచ్‌సీతోపాటు 17,18 వార్డు సచివాలయాల్లో పలు రికార్డులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బృంద వైద్యురాలు లూసీ కార్డిలియా మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు వ్యాధులు బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని సూచించారు. వచ్చే నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకూ నిర్వహించే మలేరియా మాసోత్సవాలు సందర్భంగా మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గణంకాల అధికారి ఎం.రామారావు, డీపీహెచ్ఎన్‌వో డి.నాగమణి, డేటా మేనేజర్ జగన్నాథ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ మేలు



చోడవరంలో మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

చోడవరం రూరల్: కేసులను ఒక్క మారుగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మేలైన మార్గమని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ అన్నారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కక్షిదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ పరిష్కారమే చివరిదని, దీనిపై అప్పీలుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇ.రాజేంద్రబాబు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ మాట్లాడారు. మెగా లోక్ అదాలత్‌లో 80 కేసులను పరిష్కరించారు.

అనకాపల్లిలో..



అనకాపల్లిలో కేసులను పరిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి: మెగా లోక్‌అదాలత్‌లో 82 కేసుల్లో రూ.4 కోట్ల ఆదాయానికి సంబంధించిన కేసులు పరిష్కారం అయ్యాయని 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లోక్‌అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ మార్గంలో సమస్యలు పరిష్కరించుకుని కుటుంబంతో హాయిగా గడపాలని చెప్పారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎన్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా మేటి.. ఏయూ

వీసీగా ప్రసాదరెడ్డి హయాంలో అద్భుత ప్రగతి

- అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు
- జాతీయ స్థాయిలో తొలి 3 యూనివర్సిటీల్లో స్థానం
- విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కోర్సులు
- ఆవిష్కర్తలుగా విద్యార్థులు, స్టార్టప్‌లకు హబ్‌గా విశ్వవిద్యాలయం
- ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ ప్రతిష్టని దిగజార్చిన టీడీపీ నేతలు
- 2014 నుంచి 2019 వరకూ రాజకీయ కేంద్రంగా మార్చేసిన వైనం



ప్రైవేటు వర్సిటీల అడుగులకు మడుగులొత్తుతూ.. ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మసకబారిపోయిన ఆంధ్ర విశ్వవిద్యాలయం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో కొత్త ఊపిరులందుకుంది. తమ ప్రైవేటు వర్సిటీ ఎదుగుదల కోసం ఏయూ ఓ దెయ్యాల కొంప అంటూ టీడీపీ నేతలు దిగజారుడు వ్యాఖ్యలు చేయడంతోపాటు మొత్తంగా రాజకీయ కేంద్రంగా మార్చేశారు. కానీ వీసీగా ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత నాలుగేళ్ల కాలంలో సమాజ ఉపయుక్తంగా, పరిశ్రమల అవసరాలు తీర్చే వైవిధ్య పరిశోధన కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీ మారిపోయింది. విద్యార్థి అభివృద్ధికి మార్గదర్శిగా.. పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా ఏయూను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తీర్చిదిద్దారు. వివిధ దేశాలు, యూనివర్సిటీలు, సంస్థల ఒప్పందాలతో ప్రతి విద్యార్థిని ప్రోత్సహిస్తూ ఏయూకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.



ఎలిమెంట్ భవనం

సాక్షి, విశాఖపట్నం : ఏయూను అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్న గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఉపకులపతి ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి తన హయాంలో ప్రతిష్ఠాత్మకమైన నిర్ణయాలు అమలు చేశారు. విశ్వవిద్యాలయంలో చేరే ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తీసుకొచ్చిన సంస్కరణలు విశ్వవిద్యాలయాన్ని మరో మెట్టు ఎక్కించాయి. ఏయూ జాతీయ స్థాయిలో నాక్ డబుల్ ప్లస్ గ్రేడ్‌ని, 3.74 సీజీపీఏ సాధించి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఈ గుర్తింపు 2030 వరకు ఉంటుంది. ఆచార్యుల కొరత ఉన్న సమయంలో కూడా ఏయూ ఇంతటి విశిష్ట ర్యాంక్ సాధించడం.. జాతీయ స్థాయిలో తొలి మూడు విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలవడం వెనుక ప్రసాదరెడ్డి పాత్ర శ్లాఘనీయం.

విశ్వవిద్యాలయం నలుదిశలా ప్రగతి

అప్పటి వరకూ మూసధోరణిలోనే విద్యా బోధన సాగించిన ఏయూలో.. ప్రసాదరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేక మార్పులు తీసుకొచ్చారు. విద్యార్థులను ఆవిష్కర్తలుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏయూ-నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని రూ 27 కోట్లతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో గతంలో లేని విధంగా సొంతంగా ఒక స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఆ-హబ్‌ని తీర్చిదిద్దారు. టీ-హబ్‌కు దీటుగా.. ఆ-హబ్‌లో ప్రస్తుతం 150కి పైగా స్టార్టప్ సంస్థలు ఇక్కడ నుంచి సేవలు అందిస్తూ వేలాది మంది యువతకు ఉపాధిని సైతం అందిస్తున్నాయి. ఫార్మా రంగంలో స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంగా ఎలిమెంట్ తీర్చిదిద్దారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), అవంతి ఫీడ్స్ సంస్థ సహకారంతో ఏర్పాటైన ఏయూ-అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెరైన్ సంబంధిత రంగాలలో విశిష్ట పరిశోధనలు జరుపుతూ ఈ రంగానికి అవసరమైన నిపుణులను తీర్చిదిద్దే ప్రక్రియలో విజయవంతంగా పనిచేస్తోంది. ఆర్ఐఎన్ఎల్ సహకారంలో హ్యూమన్ జెనిటిక్స్ విభాగంలో బయోఆర్బర్ ఇక్యుబేషన్ కేంద్రాన్ని, ఏయూ పూర్వ విద్యార్థి రవికిరణ్ స్థాపించిన టికాబ్స్-ఇ జీవశాస్త్ర సంబంధ పరిశోధనలు, ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు పేటెంట్లు సాధించే దిశగా పనిచేస్తోంది. అంతర్జాతీయంగా జియో ఇంజనీరింగ్ ప్రాధాన్యతను ముందుగానే గుర్తించి జియో ఇంజనీరింగ్ విభాగాన్ని పటిష్టపరిచారు. రూ.67.5 కోట్లతో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) సంయుక్తంగా ఏయూతో ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. ఫుడ్ టెస్టింగ్, ఇంక్యుబేషన్ కేంద్రం ఏయూలో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఏపీ ఫుడ్ సొసైటీ రూ 5 కోట్లు దీనికోసం మంజూరు చేసింది. ఏయూలో సేవలందిస్తున్న డిజిఫాక్ సంస్థకు వేలాది మంది యువతకు లో కోడ్ టెక్నాలజీపై ప్రత్యక్షంగా శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలను కల్పించేలా మార్పులు తీసుకొచ్చారు.



ఆ-హబ్

ఆక్రమణదారుల చెర నుంచి..

నగరం నడిబొడ్డున ఉన్న ఏయూకి చెందిన విలువైన ఆస్తులను టీడీపీ నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. యూనివర్సిటీ చుట్టూ ఉన్న భూములను దశాబ్దాలుగా ఆక్రమించి వ్యాపార సముదాయాలు నిర్మించేశారు. యూనివర్సిటీ గ్రౌండ్, దాని పరిసరాలన్నీ పొదలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఆక్రమణల పర్వంపై వీసీ ప్రసాదరెడ్డి ఉక్కుపాదం మోపారు. దాదాపు రూ.400 కోట్ల విలువైన స్థలాల్ని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే కార్యక్రమాలు చేపట్టి.. ఆ స్థలాలు విద్యార్థులకు ఉపయుక్తంగా మలిచారు.

డ్రోన్ టెక్నాలజీకి చిరునామాగా..

విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీలో యువతను మలచడానికి ఉపయుక్తంగా ఏయూలో ప్రత్యేకంగా డ్రోన్ టెక్నాలజీ కేంద్రాన్ని ప్రసాదరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేశారు. వీరికి ఉపయుక్తంగా ఏయూలో మూడు హెలీప్యాడ్లను అందుబాటులో ఉంచారు. డ్రోన్ టెక్‌లో విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల అవసరాలు అనుగుణంగా నూతనంగా అల్గారిథమ్ భవనాన్ని నిర్మించారు. దీనిలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా ఒక అంతస్తును కేటాయించారు. విశాలమైన తరగతి గదులు, సమావేశ మందిరాలు దీనిలో నిర్మించారు. నాలుగేళ్ల కాలంలో ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి నేడు 55 దేశాలకు చెందిన వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుండటం విశేషం.



అల్‌గారిథమ్ బిల్డింగ్

98 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా..

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు నూతన హాస్టల్ నిర్మాణం, ప్రయోగశాలలు, మౌలిక వసతులను కల్పించారు. 98 సంవత్సరాల వర్సిటీ చరిత్రలో ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు తొలిసారిగా ప్రత్యేక హాస్టల్ భవనాన్ని కళాశాలకు చేరువలో నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ నూతనంగా ఆరెంజ్, మెటా-హెచ్ హాస్టల్స్‌ను నిర్మించడంతో పాటు విద్య ప్రగతి విహార్, విద్య తరంగిణి విహార్ హాస్టల్‌ని నూతనంగా ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు శాతవాహన హాస్టల్‌ని పూర్తిస్థాయిలో బలోపేతం చేశారు. ప్రతీ విభాగంలో టాయిలెట్స్, విద్యార్థినుల రెస్ట్‌రూమ్‌లను పూర్తిగా మార్చుచేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఓపెన్ ఎయిర్ థియేటర్‌కి పూర్వవైభవం తీసుకువచ్చారు.

టీడీపీ హయాంలో రాజకీయ కొంపగా

2014 నుంచి 19 వరకూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఆ పార్టీ నేతలు తమ సొంత జాగీరులా మార్చేశారు. టీడీపీ మహానాడు మొదలు ఆ పార్టీకి సంబంధించిన ప్రతి సభకు అడ్డగోలుగా అనుమతిలిచ్చేశారు. 2017 మే నెలలో టీడీపీ మూడురోజుల పాటు విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో మహానాడు సభలు నిర్వహించింది. ఇందుకోసం ఏయూను ఇష్టారాజ్యంగా వినియోగించేశారు. ఆ తర్వాత 2018 మేలో ఇదే ఏయూ గ్రౌండ్స్‌లో ధర్మపోరాట సభ పేరిట తెలుగుదేశం పార్టీ బహిరంగసభ నిర్వహించింది. 2017 ఆగస్టులో జ్ఞానభేరి సదస్సు, 2019లో పసుపు కుంకుమ పంపిణీ పేరిట డ్వాక్రా మహిళలతో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఇక టీడీపీ నేతల కుమారుల పెళ్లిళ్ల మొదలు.. 2018లో అప్పటి మంత్రి లోకేష్ పుట్టిన రోజు వేడుకలు కూడా ఏయూలోనే అట్టహాసంగా నిర్వహించారు. ఇలా ఏయూను పార్టీ కార్యాలయంగా వాడేసుకున్న టీడీపీ నేతలు.. ఇప్పుడు పచ్చ కామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. అభివృద్ధి పథంలో నడిపిన తీరుని మరిచిపోయి.. అవాకులు చెవాకులతో కూడిన విషపురాతలపై విద్యార్థి లోకంతో పాటు విద్యావంతులు చీదరించుకుంటున్నారు.



వీసీ కార్యాలయం సమీపంలో టీడీపీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న పార్టీ శ్రేణులు

కూటమి నేతల బరితెగింపు

పసుపు జెండాలు, కార్యకర్తలతో హడావుడి

విశాఖసిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కూటమి నేతలు బరితెగించారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఒత్తిడితో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో పాటు రిజిస్ట్రార్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అయితే దీన్ని రాజకీయం చేసేందుకు శనివారం వర్సిటీకి వచ్చిన కూటమి నేతలు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజులు వారి అనుచరగణంతో హల్‌చల్ చేశారు. పెద్ద ఎత్తున పార్టీ నగర కార్యకర్తలను వెంటేసుకొని వచ్చి వర్సిటీ వాతావరణాన్ని భయానకంగా మార్చారు. ప్రశాంత వాతావరణంలో బాణసంచా, డప్పుల మోతతో హంగామా సృష్టించారు. కొందరు టీడీపీ కార్యకర్తలు వర్సిటీ గేట్లుకు పెద్ద ఎత్తున పసుపుజెండాలను అంటించారు. కొందరు వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉన్న జాతీయ పతాకం వద్దకు వెళ్లి హల్‌చల్ చేయడంతో పాటు పసుపుజెండాలు ఊపారు. వీరంతా మూకుమ్మడిగా రావడడంతో వర్సిటీ ఉద్యోగులు పెద్ద ఎత్తున గుమ్మిగూడారు. రాజీనామా చేసినా వీసీ ప్రసాదరెడ్డిని వదిలేది లేదంటూ హెచ్చరికలు చేశారు. ప్రసాదరెడ్డితో పాటు ఆయని ఆరాచకాల్లో భాగస్వాములైన వారు ఎవరీ వదిలిపెట్టేదిలేదంటూ హెచ్చరించారు.



వీసీ చాంబర్‌పైకెక్కి రాజకీయ నినాదాలు చేస్తున్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు

సొంత గూటికి చేరిన అమ్మ

- తల్లి గదిని ఆక్రమించిన కొడుకులు
- వరండాలో బిక్కుబిక్కుమంటూ గడిపిన వృద్ధురాలు
- నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు
- ఫలితం లేకపోవడంతో ఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'
- ఎస్పీ ఆదేశాలతో కదలిక.. ఎట్టకేలకు న్యాయం

రాంబిల్లి: సభ్య సమాజం తలదించుకునే ఘటన ఇది. తల్లికి తిండి పెట్టకపోగా ఆమె గదిని ఆక్రమించుకొని వరండాలోకి నెట్టేశారు. 80 ఏళ్ల వయస్సులో పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కిన తల్లికి న్యాయం జరగలేదు. గూడు దక్కలేదు. దీంతో ఆ తల్లి మూడో కొడుకు సాయంతో 'సాక్షి'ని ఆశ్రయించింది. నెల క్రితం ఇచ్చిన ఫిర్యాదును పక్కన పెట్టి కేసు కూడా కట్టలేదన్న విషయాన్ని, ఆ తల్లి రోదనను 'సాక్షి' విలేకరి జిల్లా ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కదలిక వచ్చి, ఆమెకు ఊరట లభించింది. రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన కొసనం మంగమ్మకు ముగ్గురు కొడుకులు. భర్త వెంకటరమణ ముగ్గురు కొడుకులకు మూడు గదులు, తమకు ఒక గది కట్టించారు. ఇద్దరు కొడుకులు శ్రీనివాసరావు, కనకరాజు గ్రామంలోనే వ్యాపారం చేసుకుంటున్నారు. మూడో కొడుకు ఆనంద్ నేవల్‌బేస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఊళ్లో ఉన్న ఇద్దరు కొడుకులు తనను చూడకపోవడంతో మూడో కొడుకు ఆనంద్ వద్ద కొంత కాలం ఉన్న మంగమ్మ తిరిగి దిమిలి వచ్చింది. తల్లి గదితో పాటు ఆనంద్ గదిని శ్రీనివాసరావు, కనకరాజు ఆక్రమించేశారు. తన గదిని ఖాళీ చేయమని తల్లి రోదించినా వారి మనసు కరగలేదు. పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదు. ఈ నేపథ్యంలో 'సాక్షి' ద్వారా సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ రంగంలోకి దిగారు. ఎస్ఐ ముకుందరావును మంగమ్మ ఇంటికి పంపించారు. మంగమ్మ కుమారులు, గ్రామ పెద్దలను ఎస్ఐ విచారించారు. యుద్ధప్రాతిపదికన గదిని ఖాళీ చేయించారు. అమ్మకు గూడు దక్కేలా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

వరండాలో తలదాచుకున్న మంగమ్మ



పింఛన్ల పంపిణీలో భాగస్వాములను చేయాలి

- దివ్యాంగులకు పెంచిన పెన్షన్లతోపాటు ఎరియర్స్ ఇవ్వాలి
- మన్యంలో అర్హులందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలి
- జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో సభ్యుల వినతి

మహారాణిపేట(విశాఖ): జూలై ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న వివిధ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తమను కూడా భాగస్వాములను చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన 1 నుంచి 7 వరకు జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ సమావేశ మందిరంలో, చైర్‌పర్సన్ చాంబర్‌లో జరిగాయి. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ పెరిగిన పింఛన్లు జూలై ఒకటో తేదీ నుంచి అందిస్తున్నారని, ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలను కూడా భాగస్వాములు చేయాలన్నారు. మండలాల్లో జరిగే కార్యక్రమంలో తమకు ప్రాధాన్యత ఉండాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ దివ్యాంగులకు కూడా పెంచిన పింఛను ఎరియర్స్‌తో ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛనుదారుల ఇంటి వద్దే పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ ఫలాల పంపిణీలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, వారికి సమాచారం లేకుండా ప్రభుత్వ పథకాలను పంపిణీ చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల పంపిణీ జరిగేదని, అదే తరహా కొనసాగాలని అధికారులను కోరారు. జిల్లాలో లక్షా 64 వేల పైచిలుకు పింఛనుదార్లకు ఈనెల రూ.112 కోట్లను పంపిణీ చేస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభారాణి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మన్యంలో అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వండి

మన్యంలో అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువగా పాడేరు, అరకు ప్రాంతాల్లో ఎంతో మంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు అన్నారు. అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం కూడా అర్హులకు జాబ్ కార్డులు ఇవ్వడం లేదని చెప్పారు. ఏజెన్సీలో జాబ్ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అయిదు రోజుల్లో అర్హులకు జాబ్ కార్డులు ఇస్తామని అల్లూరి జిల్లా డ్వామా పీడీ శివయ్య చెప్పారు.

మన్యంలో విద్యా ప్రమాణాలు పెంచాలి

మన్యంలో ప్రస్తుతం విద్యా ప్రమాణాలు ఏమి బాగోలేవని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ చదువుకున్న వారికి ఉన్నత విద్యకు అవకాశం రావడం లేదని, వివిధ విషయాలపై వారికి అవగాహన ఉండడం లేదని జెడ్పీటీసీలు గిరిబాబు, కర్రి సత్యం, కాకర దేవి, గంగరాజు అన్నారు.

రైతులతో సమావేశం

గ్రామ, మండల స్థాయిలో రైతులతో పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జెడ్పీటీసీ సభ్యులు కోరారు. మొక్కల కోసం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదురు చూస్తున్నారని, కానీ ఇక్కడ ఇవ్వడం లేదని గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు అన్నారు. నర్సీపట్నం ఏరియాలో మొక్కలు అడిగితే అధికారులు పట్టించుకోవడం లేదని జెడ్పీటీసీ రమణమ్మ అన్నారు. అనేక అంశాల్లో రైతులకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ రావడం లేదని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అనకాపల్లి జిల్లా డుమా పీడీ సందీప్ చెప్పారు. పరిశ్రమల శాఖల అధికారుల తీరును ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి ఎండగట్టారు. ప్రజా సంక్షేమ పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్య ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖలు అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు బదులిచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యల గురించి వివరించారు.

ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు

ఐదేళ్ల లోపు పిల్లలు జిల్లాలో లక్షా 38 వేల మంది ఉన్నారని, వీరికి అతిసార సోకకుండా ఉండేందుకు ప్రతి ఇంటికీ రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లను ఆశా వర్కర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు చైర్‌పర్సన్‌కు తెలిపారు. అతిసార సోకిన పిల్లల కోసం కె.జి.హెచ్‌లో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం, బెడ్లు ఏర్పాటు చేశామని, ఈ బృందం తక్షణమే స్పందించి వైద్యం అందిస్తారని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ చైర్‌పర్సన్‌కు వివరించారు. తొలుత అరకు నియోజకవర్గ శాసనసభ్యునిగా ఎన్నికైన జెడ్పీటీసీ రేగ మత్స్యలింగంను జెడ్పీ తరఫున అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ ఆగ్రహం

స్థాయీ సంఘాల సమావేశాలకు కొందరు అధికారులు గైర్హాజరు కావడం పట్ల జెడ్పీ చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటివి పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మహిళల ఆర్థిక ప్రగతికి అధికారులు కృషి చేయాలని, అలాగే మైదాన ప్రాంతాలతోపాటు గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ వంటి వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు.

స్పీకర్‌కు సత్కారం

నర్సీపట్నం: బాధ్యతలు స్వీకరించిన తర్వాత సొంత నియోజకవర్గం నర్సీపట్నం వచ్చిన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని పార్టీ నేతలు ఎన్టీఆర్ స్టేడియంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టి నోటికి ప్లాస్టర్ వేయడం వల్ల ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానన్నారు. తన 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒకే నియోజకవర్గంలో పది సార్లు పోటీ చేసి ఏడుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ, ఐదు సార్లు మంత్రిగా చేశానని, ఈ గౌరవం ఎవరికోగాని దక్కదన్నారు. చంద్రబాబు అప్పగించిన బాధ్యతలు హుందాగా నిర్వహించడమే కాకుండా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. వలంటీర్ వ్యవస్థ లేనందున జూలై ఒకటిన పింఛను సొమ్మును దగ్గరుండి మీరే పంపిణీ చేయాలని టీడీపీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు తన రాజకీయ గురువు అన్నారు. రెడ్ బుక్ తన కన్నా అయ్యన్న వద్ద ఉంటేనే బావుండేదన్నారు. ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ అయ్యన్న పాత్రుడి ఆశీస్సుల వల్లే తాను అత్యధిక మెజారిటీతో విజయం సాధించానన్నారు. చోడవరం, యలమంచిలి, విశాఖ తూర్పు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయకుమార్, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాల పాప తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ అయ్యన్నపాత్రుడిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

నూకాంబిక దర్శనం

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట: అనకాపల్లి గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని శనివారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అయ్యన్నపాత్రుడికి అందజేశారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సుధారాణి పాల్గొన్నారు. కశింకోట మండలం తాళ్లపాలెంలోని నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద కొంతసేపు ఆగి అయ్యన్నపాత్రుడు అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్ ఆధ్వర్యంలో గజమాల, పూలమాలలు వేసి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయం చేరుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడిని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

కొండెంపూడి కేవీకేలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు



కొండెంపూడిలో గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

బుచ్చెయ్యపేట : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో గోల్డెన్ జూబ్లీ వేడుకలను శాస్త్రవేత్తలు ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం కొండెంపూడి కేవీకేలో ఈ వేడుకలను నిర్వహించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్.రాజ్‌కుమార్ విజయోత్సవ జ్యోతిని వెలిగించారు. యాభై ఏళ్లలో రైతులకు అందించిన సేవలు, మేలు రకం విత్తనాలు, దిగుబడి, రైతులు సాధించిన విజయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకేల ద్వారా అందిస్తున్న మేలు రకం విత్తనాలు, వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పొంది అధిక పంట దిగుబడులు సాధించాలని రైతులకు ప్రధాన శాస్త్రవేత్త సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సత్తిబాబు, కిషోర్‌కుమార్, బాలు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

చోడవరం : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. అంతేకుండా జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ఆయా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇటీవల విశాఖపట్నం నౌసేనాబాగ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి 7వ కాడెట్ క్యూరుగి, పూమ్‌సే జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పతకాలు సాధించిన వారిని రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చోడవరం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. సి. వర్ధన్‌కుమార్, గండి కారుణ్య సందీప్, గండి రిషిత్, ఎ.చార్విక్ , డి. సుజిత, ఎన్. రిషీతాంజలి, డి.విజయ్‌కుమార్ బంగారు పతకాలు సాధించారు. అంతేకాకుండా వీరు ఉమ్మడి జిల్లా నుంచి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడేందుకు ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లం మురళి తెలిపారు.

300 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్



గంజాయి తరలిస్తున్న కారు



స్వాధీనం చేసుకున్న 150 గంజాయి ప్యాకెట్లు

చోడవరం రూరల్ : ముందస్తు సమాచారం మేరకు చోడవరం పోలీసులు జరిపిన తనిఖీలో పెద్ద సంఖ్యలో గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర నిందితులు పట్టుబడ్డారు. 150 ప్యాకెట్లలో 300 కేజీల గంజాయి, దానిని రవాణా చేస్తున్న కారును పోలీసులు పట్టుకున్నారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం 8 గంటల సమయంలో చోడవరం ఎస్‌ఐ డి.శేఖరంనకు అందిన సమాచారం మేరకు పోలీస్ పెట్రోల్ బంకు వద్ద సిబ్బందితో కలసి తనిఖీ నిర్వహించగా ఏపి 31 సిఇ 6567 నంబర్‌తో మహీంద్ర ఎక్స్‌యువి కారులో 150 ప్యాకెట్లలో గంజాయిని నింపి తరలిస్తున్నట్టు తేలిందన్నారు. ఒక్కో ప్యాకెట్‌లో రెండు కేజీల మేరకు గంజాయి ఉందని మొత్తం 300 కేజీల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనికి సంబంధించి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా చెందిన నిందితులు అనంత పాంగి, కిముడు నిరంజన్‌లను అరెస్టు చేసి, చోడవరం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌నకు తరలించినట్టు సీఐ తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ బ్లాక్ మార్కెట్‌లో సుమారు రూ.15 లక్షల పైబడి ఉంటుందని అంచనా.

కక్షసాధింపు రాజకీయాలు వద్దు

- 300 జీడి చెట్లు, 200 పైగా కొబ్బరి మొక్కలను నరకడం తగదు
- బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పరామర్శ



ఈ విధంగా 300 జీడిచెట్లు నరికేశారు

నాతవరం: వైఎస్సార్‌సీపీ నాయకుడు వ్యవసాయ భూమిలో కొబ్బరి మొక్కలను, జీడి చెట్లను ధ్వంసం చేయడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని డి.యర్రవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సబ్బవరపు వెంకునాయుడుకు చెందిన మూడెకరాల మెట్ట భూమిలో 300 జీడి చెట్లు, 200పైగా కొబ్బరి మొక్కలను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎప్పటి మాదిరిగానే అతడు శనివారం ఉదయం తన తోటలోకి వెళ్లాడు. అక్కడ జీడి చెట్లతోపాటు కొబ్బరి మొక్కలు నరికేసి ఉండటాన్ని చూసి తీవ్రంగా రోదించాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం కల్పించారు. రెండు కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లి ధ్వంసం చేసిన జీడి చెట్లు, కొబ్బరి మొక్కలను చూసి కలత చెందారు. అనంతరం ఉమా శంకర్ గణేష్ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకుడిపై కక్షసాధింపు చర్యలతోనే ఈ దారుణానికి తెగబడ్డారని ధ్వజమెత్తారు. లక్షలాది రూపాయలు ఆదాయాన్నిచ్చే తోటలను ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. రాజకీయంగా ఇలాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో ఇంతవరకు జరగలేదని, ఇప్పుడు కొత్త సంస్కృతి సృష్టించడం మంచి పద్ధతి కాదన్నారు. నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కష్టపడి పెంచుకున్న జీడి తోట ఫలసాయం చేతికందే సమయంలో ఈ విధంగా చేయడం బాధాకరమన్నారు. ఈ సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వం అధికార యంత్రాంగం దృష్టి సారించాలని కోరారు. నియోజకవర్గంలో ఇలాంటివి జరిగినప్పుడు నాయకులు, కార్యకర్తలు భయపడకుండా ధైర్యంగా ఉండాలన్నారు. వారికి వైఎస్సార్ సీపీతోపాటు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం బాధిత రైతు వెంకునాయుడు మాట్లాడుతూ పంట నష్టం రూ.3 లక్షలకుపైగా ఉంటుందన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ పైల సునీల్, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, శిరుసుపల్లి నర్సింగరావు, మాకిరెడ్డి వెంకటరమణ, మంకు సాంబమూర్తి, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, డి.యర్రవరం ఎంపీటీసీ ఇనసప్పల పుష్ప, నర్సీపట్నం పట్టణాధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

ప్రమాదమా..? నిప్పు పెట్టారా?

- ఇంటి ముందు పార్కు చేసిన స్కూటీ దగ్ధం
- అల్లూరి సీతారామరాజుకాలనీలో ఘటన
- ఆగంతకుల దుశ్చర్యే అని బాధితుల అనుమానం



బండ వెంకటలక్ష్మి, స్కూటీ యజమాని



దగ్ధమైన స్కూటీ

యలమంచిలి రూరల్ : పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీ దగ్ధమైంది. కాలనీలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రిసోర్సు పర్సన్‌గా పనిచేస్తున్న బండ వెంకటలక్ష్మికి చెందిన హోండా ఏక్టివా వాహనం నుంచి శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఎదురింట్లో నివసిస్తున్న వారు ఆ మంటలు చూసి ఫోన్ చేసి చెప్పడంతో వెంకటలక్ష్మి, కుమారుడు మురళీకృష్ణ, అతని పిన్ని మంటలార్పేందుకు ప్రయత్నించారు. ఈలోగా కేకలు విన్న కాలనీలో చుట్టుపక్కలవారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు. అయితే అప్పటికే వాహనం సగానికి పైగా కాలిపోయింది. శుక్రవారం రాత్రి 11.40 గంటల వరకు మెలకువగా ఉన్న కుటుంబ సభ్యులు ఆ తర్వాత నిద్రపోగానే ఈ ఘటన చోటు చేసుకుంది. పెద్ద శబ్దంతో అగ్ని కీలలు ఎగసిపడడంతో ఇంటికి విద్యుత్ సరఫరా అందించే సర్వీసు వైరుకు మంటలు వ్యాపించి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగి ఉండేది. ఇంట్లో నిద్రిస్తున్న వారికి కూడా ప్రమాదం జరిగి ఉండేది. దగ్ధమైన స్కూటీకి సమీపంలో గల 7 ద్విచక్రవాహనాలను స్థానికులు సకాలంలో దూరంగా తీసుకుపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించడంతోనే స్కూటీ దగ్ధమైనట్టు బాధితురాలు, ఆమె కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమకు, తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని బాధితురాలు వెంకటలక్ష్మి కోరారు. అల్లూరి సీతారామరాజు కాలనీలో ఇటీవల చోరీలు, నేరాలు పెరిగిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైన కొందరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్టు భావిస్తున్నారు. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేసి ఇలాంటి నేరాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో అంకితభావం ప్రశంసనీయం



పదవీవిరమణ చేసిన పోలీస్ సిబ్బందితో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

జిల్లాలో 9 మంది పోలీస్ సిబ్బంది పదవీవిరమణ

అనకాపల్లి : పోలీస్‌శాఖలో అంకిత భావంతో విధుల నిర్వహించిన సిబ్బందికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. జిల్లాలో 9 మంది పోలీస్ సిబ్బంది పదవీవిరమణ చేసిన సందర్భంగా తమ కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు క్రైం ఎస్పీ పి.సత్యనారాయణ రావుతో పాటు 8మందిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఎక్కడ రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారని, పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడి, ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందని, అలాంటి ఉద్యోగంలో మనం చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం పదవీవిరమణ చేసిన డీటీసీ డీఎస్పీ డి.రామవర్మ, మాకవరపాలెం ఎస్‌ఐ ఎస్. సన్యాసిరావు, బుచ్చెయ్యపేట ఎస్సై వి.సిహెచ్.నాయుడు, వి.మాడుగుల ఎస్‌ఐ ఎస్.నాగరాజు, ఆర్ ఎస్‌ఐ సి.హెచ్.వెంకట రావు, నాతవరం ఏఎస్‌ఐ డి.బంగారు రాజు, కె.కోటపాడు ఏఎస్‌ఐ ఆర్.రాముడు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏఆర్ఎస్‌ఐ ఎల్.శంకరరావులను శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు లక్ష్మణ మూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, మన్మథరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురికి రెండేళ్ల జైలు

చోడవరం : గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు రెండేళ్లపాటు జైలు శిక్ష విధిస్తూ చోడవరం తొమ్మిదవ అదనపు జిల్లా కోర్టు శనివారం తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ఈ కేసులో ముంచంగిపుట్టు మండలం మకరం గ్రామానికి చెందిన నిందితులు ప్రధాని నాగేశ్వరరావు (40), ముక్కి సిద్దేశ్ (35), ముక్కి మోహన్ (40)లకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పిందని ఎస్పీ తెలిపారు. వివరాల్లోకి వెళితే ..2016 సంవత్సరం అక్టోబరు 25వ తేదీన మకరం గ్రామానికి చెందిన ప్రధాని నాగేశ్వరరావు, ముక్కి సిద్ధేశ్, ముక్కి మోహన్ కలిసి బస్తాతో గంజాయిని అక్రమ రవాణా చేస్తూ చోడవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుబడ్డారని ఎస్పీ చెప్పారు. 15 కేజీల గంజాయితోపాటు రూ. 30వేలు నగదును చోడవరం పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదుతోపాటు వీరి ముగ్గురినీ అప్పట్లో చోడవరం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టుకు హాజరుపర్చడం జరిగిందన్నారు. దీనిపై వాదనలు జరిగిన అనంతరం నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష రూ.60వేలు జరిమానా విధించినట్టు ఎస్పీ చెప్పారు. జరిమానా కట్టలేని ఎడల అదనంగా మరో 6 నెలల పాటు జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ తీర్పు చెప్పినట్టు ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా చోడవరం పోలీసులను ఎస్పీ అభినందించారు.

ఫ్లెక్సీల చించివేతపై కేసు నమోదు

మాకవరపాలెం : ఫ్లెక్సీ చించివేసిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకు స్వాగతం పలుకుతూ మండలంలోని రామన్నపాలెం జంక్షన్ వద్ద టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే వీటిని గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి చించివేయడంతో శనివారం ఉదయం టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రానిక్ సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రి

చోడవరం రూరల్ : పట్టణంలోని గునిశెట్టివారివీధికి చెందిన తేలపల్లి నాగేశ్వరరావు ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో లక్షల రూపాయల విలువైన ఎలక్ట్రానిక్ సామగ్రి అగ్నికి ఆహుతయ్యింది. శుక్రవారం రాత్రి సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులైన ఏసి, సీలింగ్ ఫ్యాన్లు, కూలర్, ఫ్రిజ్, టీవీ వంటి విలువైన సామగ్రితో పాటు ఇంట్లోని పలు వస్తువులు, వస్త్రాలు కాలిపోయాయి. వైరింగ్ మొత్తం దగ్ధం అయ్యింది. నాగేశ్వరరావు కుటుంబీకులు శుక్రవారం ఉదయం సొంత పనికోసం వేరే గ్రామానికి వెళ్లి రాత్రి తిరిగి వచ్చేసరికి లోపల ఇంట్లోని వస్తువులు కాలిపోవడంతో చోడవరం అగ్నిమాపక దళానికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటల్ని అదుపు చేశారని బాధితుడు తెలిపారు. సుమారు నాలుగు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు చెప్పారు.

చెరకులో తెగుళ్లు గుర్తించి నివారించుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చోడవరం రూరల్ : చెరకు రైతులు పంటను ఆశించే ఎర్రకుళ్లు, ఎల్లో మొజాయిక్ (పసుపు ఆకు) తెగుళ్లను గురించి, తక్షణం వాటి నివారణ చర్యల చేపట్టాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త వి.చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గోవాడ గ్రామంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఆయా పంటలను సాగుచేస్తున్న రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎర్రకుళ్లు లేదా ఎల్లో మొజాయిక్ తెగులు సోకకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. పది కేజీల వేపపిండి, 90 కేజీల పశువుల ఎరువు, కేజీ టి.విరిడి కలిపిన మిశ్రమాన్ని దుక్కి చాళ్ళలో వేసుకోవాలన్నారు. పసుపు ఆకు తెగులు నివారణకు డైమిథియేట్ లేదా మోనోక్రోటోఫాస్‌ను పిచికారీ చేయాలన్నారు. అప్పటికే ఎండిపోయిన ఆకులను వేరు చేసి కాల్చివేయాలని సూచించారు. వరి సాగులో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని, అలాగే విత్తనం చల్లుకునే ముందుగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని మరో శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.విజేత, గోవాడ గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.స్వాతి పాల్గొన్నారు. ఆయా పంటభూములకు చెందిన రైతులు హాజరయ్యారు.

శ్రీరామగిరి రామాలయంలో డాగ్ స్క్వాడ్ తనిఖీ



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం

వీఆర్‌పురం (అల్లూరి సీతారామరాజు జిల్లా): శ్రీరామగిరి సుందర సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో స్వామివారి వాహనాలు చోరీ జరిగిన ప్రదేశాన్ని ఎస్సై కె.నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ డాగ్ స్క్వాడ్ బృందం శనివారం పరిశీలించింది. శ్రీరామనవమి సమయంలో స్వామివారి కల్యాణ సమయంలో మండపానికి తీసుకువెళ్లేందుకు వినియోగించే ఇత్తడి తొడుగులతో రూపొందించిన గరుడ వాహనం, అశ్వ వాహనం, హనుమంత్ వాహనాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. చెక్కరూపంలో తయారు చేసిన ఈ విగ్రహాలకు పై భాగంలో ఇత్తడితో తొడుగులు చేసి అమర్చటం జరిగిందని ఎండోమెంట్ సిబ్బంది సాయిబాబా తెలిపారు. ఈ మూడు విగ్రహాలపై 70 కేజీల వరకు ఇత్తడి ఉంటుందని, వాటి విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. ఆలయానికి తూర్పు వైపు గేటుకు తాళం వేయకపోవడం, ఆలయ ఆవరణలో వాహనాలు భద్రపరచిన గదికి సైతం తాళాలు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే దుండగులు విగ్రహాలను సులభంగా అపహరించుకుపోయారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రిమ్‌పెక్ విన్యాసాల్లో ఐఎన్ఎస్ శివాలిక్



పెరల్ హార్బర్‌కు చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్

సింధియా(విశాఖ): ప్రపంచంలోనే అతి పెద్ద నౌకాదళ విన్యాసం రిమ్ ఆఫ్ ది పసిఫిక్(రిమ్ పెక్)లో పాల్గొనేందుకు భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్ శివాలిక్ హవాయిలోని పెరల్ హార్బర్‌కు చేరుకుంది. ఇండియా–జపాన్ మధ్య ద్వైపాక్షిక వ్యాయామం జిమెక్స్–2024 పూర్తయిన తర్వాత ఐఎన్ఎస్ శివాలిక్ పెరల్ హార్బర్‌కు చేరుకున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. హార్బర్ దశలో బహుళ సింపోజియమ్, వ్యాయామ ప్రణాళిక చర్చలు, క్రీడా పోటీలు, పరస్పర డెక్ సందర్శనల్లో శివాలిక్ బృందం పాల్గొనుంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ విన్యాసాలు జూలై 7వ తేదీ వరకు కొనసాగుతాయి.

ఆరోగ్యానికి వాకింగ్

- సర్వరోగ నివారిణిలా పని చేస్తున్న నడక
- నిత్యం నడిస్తే మంచిదని నిపుణుల సూచన

నేటి ఆధునిక కాలంలో పెద్దగా శ్రమపడని వారు తప్పనిసరిగా వాకింగ్ చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో మన పెద్దలు ఇంటి పని.. ఇతర పనులను స్వయంగా చేసుకోవటం.. కిలోమీటర్ల కొద్దీ నడవటం వల్ల వారికి పెద్దగా వ్యాయామం అవసరం ఉండేది కాదు. కానీ మనం ఎటువంటి శారీరక శ్రమ లేకుండా బతుకుతున్నాం కనుక నేటి మానవుడికి తప్పకుండా వ్యాయామం.. వాకింగ్ వంటివి అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.


జీవీఎంసీ క్రీడా మైదానంలో వాకర్లు


గవరపాలెం పార్కు సెంటర్‌లో వాకింగ్ చేస్తున్న మహిళలు

అనకాపల్లి : మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పుల కారణంగా ఊబకాయం, షుగర్, బీపీ, నరాల బలహీనత, కండరాల బలహీనత వంటి అనేక వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రజలు వ్యాయామం, నడకపై దృష్టి సారించారు. నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగాల బారిన పడిన రోగులు మందులతో సరిపెట్టుకోకుండా నిత్యం వాకింగ్ చేస్తే మంచిదని చెబుతున్నారు. నేటి ఆహారపు అలవాట్లు, జీన్స్ కారణంగా ఊబకాయం సమస్య తీవ్రతరమైంది. ఇటువంటి దశలో వైద్యుడిని సంప్రదిస్తే నడవమని సూచిస్తున్నారు.

నడకకు ప్రాధాన్యం..

పట్టణంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం, గవరపాలెం పార్కు సెంటర్, శారదా నది ఒడ్డున గల శాంతి పార్కు, రింగ్ రోడ్డు పార్కు, కొత్తూరు పార్కు, ఏలేరు కాలువ రహదారిపై నిత్యం వేలాది మంది యువత, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వాకింగ్ చేస్తున్నారు. సమయాన్ని బట్టి ప్రతి ఒక్కరూ వాకింగ్‌పై దృష్టి పెడుతున్నారు. ఉదయం వాకింగ్ వల్ల సూర్యకిరణాల్లోని కాల్షియం ఎముకలకు మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ శాతం మహిళలు ఉదయం వేళల వాకింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉదయం కుదరని వారు మాత్రమే సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. పట్టణ పరిధిలో సుమారు 35 వరకూ వాకర్స్ క్లబ్‌లు ఏర్పడ్డాయి. వృద్ధుల నుంచి పిల్లల వరకు క్లబ్‌లు ఏర్పాటు చేసుకుని వాకింగ్, యోగా చేస్తున్నారు. జార్జి క్లబ్, రింగ్ రోడ్డు, తుమ్మపాల వాటర్ ట్యాంక్ ఏరియా, గవరపాలెం ప్రాంతాల్లో యోగా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో ఆయుష్మాన్ భారత్‌లో నాలుగు మాసాలుగా ఆస్పత్రికి వచ్చే రోగులతో యోగాసనలు వేయిస్తున్నారు. వయస్సును బట్టి రోజుకు 30 నిమిషాల నుంచి గంటలోపు వాకింగ్ చేయాలని వైద్యులు చెబుతున్నారు.


వేకువ జామునే ఉల్లాసంగా నడుస్తున్న వాకర్లు

నడకతో ప్రయోజనాలు..

- క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి వాటిని అధిగమించవచ్చు.
- శరీర ఆకృతి బాగుంటుంది. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పని చేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం, నరాల బలహీనత వంటివి దరి చేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను జయించవచ్చు.
- కీళ్లనొప్పులు తగ్గి, కండరాల శక్తి పెరిగి నడిచేందుకు వీలు కలుగుతుంది.
- శరీరంలోని అధిక కొవ్వును తగ్గిస్తుంది.
- శరీరానికి మంచి శ్వాస, అధిక స్థాయిలో ఆక్సిజన్ అందుతుంది.
- ఎముకలు దృఢంగా తయారవుతాయి.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- మానవుని జీవితకాలం పెరుగుతుంది.
- మెదడు చురుగ్గా పని చేస్తుంది.
- విటమిన్-డి లోపం ఉండదు. క్యాన్సర్ వ్యాధి సోకదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

జీవిత కాలాన్ని పెంచుతుంది..



నాయసు 48 సంవత్సరాలు. నిత్యం వాకింగ్ వల్ల జీవిత కాలం పెరిగి, యువకుడిలా పనులు చేయగలుగుతున్నాను. ఇద్దరు పిల్లలకు వివాహం చేశాను. సుమారు 26 సంవత్సరాలుగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో ఉదయం వేళల్లో వాకింగ్ చేస్తున్నాను. ఇప్పటి వరకూ ఎటువంటి వ్యాధుల బారిన పడలేదు. మంచి ఆహారం తీసుకుంటున్నాను. – ఓం నమ:శివాయ, వాకర్, అనకాపల్లి

కోవిడ్ తర్వాత వాకింగ్‌పై ఆసక్తి పెరిగింది..



నేను ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ చేశాను. ప్రస్తుతం నాకు 77 సంవత్సరాలు. ఎటువంటి వ్యాధి బారిన పడలేదు. ఎండా, వర్షం చూడకుండా నిత్యం ఉదయం వేళల్లో గంట పాటు వాకింగ్ చేస్తాను. కోవిడ్ సమయంలో కూడా వాకింగ్ మానలేదు. వయసును బట్టి ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకున్నాను. రాత్రి ప్రశాంతంగా నిద్ర పడుతుంది. – కేవీ గౌరీపతి, విశ్రాంత డిప్యూటీ డీఈవో, అనకాపల్లి

వాకింగ్ సర్వరోగ నివారిణి..



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి తగ్గడంతో వ్యాధుల బారి నుంచి విముక్తి కలుగుతుంది. బీపీ, షుగర్ వ్యాధులు సోకిన రోగులు నిత్యం వాకింగ్ చేయడంతో శరీరంలో కండరాలు, ఎముకలు గట్టి పడి ఆరోగ్యంగా కనిపిస్తారు. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్ధకంగా ఉంటుంది. వాకింగ్ చేసిన వ్యక్తి నిత్యం యువకుడిలా కనిపిస్తాడు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వం యోగాపై ఉచిత శిక్షణ అందిస్తోంది. – కె.లావణ్య, ఆయుష్మాన్ భారత్ వైద్యురాలు, ఎన్టీఆర్ ఆసుపత్రి

క్లుప్తంగా

పాల సొసైటీ ఎన్నికల్లో ఇద్దరు ఏకగ్రీవం


సభ్యులను సత్కరిస్తున్న సూపర్‌వైజర్ ఏసుదాసు తదితరులు

తుమ్మపాల : మండలంలో తుమ్మపాల మేజర్ పంచాయతీ విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం-2లో శనివారం జరిగిన బోర్డు సభ్యుల ఎన్నికలో ఇద్దరు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు విశాఖ డెయిరీ జోనల్ సూపర్‌వైజర్ ఎడ్ల ఏసుదాసు తెలిపారు. పాల ఉత్పత్తిదారులు కనుబుడ్డి సత్యనారాయణ (చిన్న), గుద్దేటి వెంకటలక్ష్మి బోర్డు సభ్యులుగా నిలబడగా వారికి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్రి బాబీ, పాల సంఘం-2 అధ్యక్షుడు పెద్దిశెట్టి బద్రీనారాయణ, సొసైటీ కార్యదర్శి దిమ్మల అర్జున, పాలకవర్గ సభ్యులు ఎం.నాగరాజు, ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

అలీ సేవలు ప్రశంసనీయం


అలీని సత్కరిస్తున్న డీపీఆర్‌వో ఇంద్రావతి, అధికారులు

తుమ్మపాల : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో డ్రైవర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎస్.కె. అలీని డీపీఆర్‌వో కె.ఇంద్రావతి, అధికారులు సత్కరించారు. అలీ క్రమశిక్షణతో పని చేశారని ఆమె అన్నారు. 1982లో ఇరిగేషన్ శాఖలో మెకానికల్ హెల్పర్‌గా విధుల్లో చేరి 1998 నుంచి సమాచార శాఖలో డ్రైవర్‌గా పని చేస్తూ పదోన్నతి పొందినట్లు తెలిపారు. 42 సంవత్సరాల సర్వీసును విజయవంతంగా పూర్తి చేశారన్నారు. కోవిడ్ సమయంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఈ ఎ.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అచ్యుతాపురం : మండలంలోని మల్లవరం, నరేంద్రపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్పంచ్ పిన్నమరాజు వాసు చేతుల మీదుగా శనివారం బ్యాగుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో రావి శోభన్‌బాబు, చందక శివ, రావి నాయుడు, రావి కాసుబాబు, కిలాడి చినబాబు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 23 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,230	5,230
రెండో రకం	--	--
మూడోరకం	3,800	3,800

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
కల్కి2898 ఏడీ	:వెంకటేశ్వర
ప్రభుత్వ జూనియర్ కళాశాల	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 94 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-19యూనిట్లు, బి పాజిటివ్-34 యూనిట్లు, ఒ పాజిటివ్-31 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ 9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 306 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

మొలక శాతం పరీక్ష తప్పనిసరి

తుమ్మపాల : వరి సాగు చేసే రైతులు నారు వేసుకునే ముందు విత్తన మొలక శాతం పరీక్షలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాల బస్తా కొనుగోలు చేసిన రైతులు బస్తా నుంచి 100 గింజలు తీసుకుని మొలక కట్టి, మొలక శాతాన్ని పరీక్షించాలన్నారు. 80 శాతానికి మించి మొలక వస్తే అది మంచి విత్తనంగా పరిగణించాలన్నారు. వాటిని పొలంలో వేయొచ్చని తెలిపారు. అలా కాకపోతే ఆ బస్తాను ఆకుపచ్చ లేబుల్, ట్యాగులతో పాటు కొనుగోలు చేసిన కేంద్రానికి తిరిగి తీసుకెళ్లాలన్నారు. రైతులు వరి నారు వేసే ముందు తప్పని సరిగా విత్తన శుద్ధి చేయవలసి ఉందన్నారు. కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బెండిజం 50 శాతం మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలన్నారు. దంప నారుమళ్లకు అయితే లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం 50 శాతం మందు కలిపి, ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలన్నారు. తదుపరి 24 గంటలు మండకట్టి మొలకెత్తిన విత్తనాన్ని నారుమడిలో చల్లుకోవాలన్నారు. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటర్ మందు నీరు సరిపోతుందన్నారు. జీవ శిలీంద్ర నాసిని అయిన సూడోమోనాస్, ట్రైకోడెర్మవిరిడిను కిలో విత్తనానికి 8 గ్రాముల చొప్పున వాడుకుంటే కాండం కుళ్లు, వేరు కుళ్లు, ఎండు తెగులు నుండి పంటలను రక్షించుకోవచ్చని తెలిపారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట : ధ్యాన వేంకటేశ్వరస్వామి పూలమాలల అలంకరణతో శనివారం కనువిందు చేశారు. జేష్టమాసం శనివారాన్ని పురస్కరించుకుని స్వామిని పూలమాలలు, తులసి మాలలు, వజ్ర కవచ ధారణతో సుందరంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి ప్రత్యేక హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా గణాంక దినోత్సవం


గణాంక పితామహుడు మహాలనొబిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

తుమ్మపాల : గణాంక పితామహుడు స్వర్గీయ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జయంతిని పురస్కరించుకుని జిల్లా అర్థ గణాంకశాఖ కార్యాలయంలో 18వ జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా అర్థ గణాంక శాఖాధికారి జి.రామారావు మహాలనోబిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వర్గీయ మహాలనోబిస్ గణాంకాల ద్వారా ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. జూన్ 29న ఆయన జన్మదినాన జాతీయ గణాంక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో డాటా ప్రాధాన్యతకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాటా సరిగా ఉంటేనే ప్రజాభివృద్ధికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతో బ్యాంకు అభివృద్ధి

బదిలీపై వెళ్తున్న బ్యాంకు మేనేజర్‌కు ఆత్మీయ సన్మానం


మేనేజర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు


కె.జె.పురం ఏపీజీవీబీ మేనేజర్ సాయి సుధాకర్‌ను సన్మానిస్తున్న వెలుగు వీపీవోలు

మాడుగుల రూరల్: ఖాతాదారులు, రైతులు, స్వయం సహాయక సంఘాల సహకారంతో గ్రామీణ వికాస బ్యాంకును మూడు సంవత్సరాల వ్యవధిలో ప్రగతి పథంలో నడిపించామని బ్రాంచి మేనేజర్ వి. సాయి సుధాకర్ తెలిపారు. కేజేపురం బ్రాంచ్ నుంచి ఆయన విజయనగరం ప్రాంతీయ కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం సాయంత్రం ఇక్కడ బ్యాంకు ఆవరణలో వెలుగు వీపీవోలు, సీఎస్పీ పాయింట్ల ప్రతినిధులు, ఖాతాదారులు ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సాయి సుధాకర్ మాట్లాడుతూ 2021లో తాను ఇక్కడ బీఎంగా బాధ్యతలు స్వీకరించే సమయంలో రూ.27 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహించగా, ఈ మూడేళ్లలో రూ.18 కోట్లకు పెంచామన్నారు. ప్రధానంగా బ్యాంకు సిబ్బంది, ఖాతాదారుల సహకారం మరవలేనిదన్నారు. సభకు అధ్యక్షత వహించిన బ్యాంకు ఫీల్డ్ అధికారి ఎం. భవానీప్రసాదు మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయులు కాళ్ల అమ్మతల్లినాయుడు, దాడి రాము, పుట్టా గోపి, వెలుగు వీవోఏలు కుమార రాజు, ఆడారి సావతి, తదితరులు మేనేజర్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు బ్యాంకు క్యాషియర్ భానుచందర్, మేసేంజర్ ఎం. అప్పారావు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ మేనేజర్‌గా రమేష్..

కేజేపురం ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్‌గా ఎం.రమేష్ నియమితులయ్యారు. ఈయన విజయనగరం జిల్లా గజపతినగరం గ్రామీణ వికాస్ బ్యాంకు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 20 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

గొలుగొండ: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఎల్ పురంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఏఎల్‌పురంతోపాటు కొంకసింగి, నాగాపురం, గోకిరి, పాడి తదితర గ్రామాల నుంచి 103 మంది రోగులు హాజరయ్యారు. వీరిలో 20 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు నిమిత్తం విశాఖకు తరలించినట్లు వైద్యులు నికిత, ప్రోగ్రాం మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. మిగతా వారికి మందులు అందించినట్లు చెప్పారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల కోసం (రెండో విడత) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువ పత్రాలతో ఐటీఐ వైబ్‌సైట్‌లో జూలై 24వ తేదీలోగా ఐటీఐ నందు రిజిస్ట్రేషన్ చేయించుకుని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులకు కౌన్సెలింగ్ జూలై 27న చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

తెగుళ్లపై రైతులు దృష్టి సారించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రామలక్ష్మి

అనకాపల్లి : ఖరీఫ్ సీజన్‌లో వరి నారుమడులు వేసుకునే రైతులు తెగుళ్లు, పురుగులు, వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సీహెచ్ రామలక్ష్మి అన్నారు. మండలంలో బవులవాడలో వ్యవసాయ శాఖ, ఆత్మ సౌజన్యంతో ప్రధాన పంటల్లో సమగ్ర సస్య రక్షణపై రైతులకు శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు, వరి నాడుమడులు వేసే విధానం, నారు మడిలో వచ్చే తెగుళ్లు, పురుగులు, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. వర్షా కాలంలో విష సర్పాలపై దృష్టి పెట్టాలని, పొలాల్లోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కర్ర తీసుకెళ్లాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పి.రంగాచారి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లోనూ వరి విత్తనాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి తులసి కుమారి, ఆత్మ ఏటీఎం పి. రామకృష్ణ, జిల్లా వనరుల కేంద్రం విస్తీర్ణ అధికారి సాయివాణి, బవులువాడ గ్రామ సర్పంచ్ మజ్జి లక్ష్మీ వెంకట అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు తోటాడ విజయ్, రైతు నాయకులు కోట్ని వెంకట సత్య ఈశ్వరరావు, మజ్జి అర్జున్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు

చిననందిపల్లి దేవస్థానం భూముల కౌలుకు వేలం రేపు


చిననందిపల్లి ఉమా నీలకంఠేశ్వర స్వామి

దేవరాపల్లి: చిననందిపల్లిలో ఉమా నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థాన భూముల కౌలు సాగుకు వచ్చే నెల 1న టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో టీఎస్ఎస్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిననందిపల్లి సర్వే నంబర్ 50లో 3.37 ఎకరాలు, సర్వే నంబర్ 112లో 5.03 ఎకరాలు మొత్తంగా 8.40 ఎకరాలు దేవస్థానం భూములు ఉన్నాయన్నారు. ఈ భూములకు మూడు సంవత్సరాల కౌలుకు గాను టెండర్, బహిరంగ వేలం పాటను ఈ నెల 3, 21వ తేదీల్లో నిర్వహించగా, దేవదాయ అధికారులు ప్రకటించిన ప్రారంభ వేలం పాట ధర అధికంగా ఉండటంతో రైతులు ముందుకు రాలేదు. దీంతో వేలం పాటను ఇప్పటికి రెండు మార్లు వాయిదా వేశారు. తాజాగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే టెండర్, బహిరంగ వేలంలో గ్రామస్తులంతా పాల్గొనాలని కోరారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.3 వేల ధరావత్తు చెల్లించాలని, వేలం పాట పూర్తయిన వెంటనే హెచ్చు పాటదారుడు తొలి సంవత్సరం బిడ్ శిస్తు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాణాధికారిని సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో 'నేను బడికి పోతా' ర్యాలీలు


ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చోడవరం రూరల్: పిల్లలను బడికి పంపించడం కోసం ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగంగా విద్యా శాఖ నిర్వహిస్తున్న నేను బడికి పోతా కార్యక్రమాలు గ్రామ గ్రామాన సాగుతున్నాయి. శనివారం గౌరీపట్నం, చోడవరం పట్టణం గునిశెట్టివారి వీధి పాఠశాలల పరిధిలో నేను బడికి పోతా చైతన్య ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మండల విద్యాధికారులు జయలక్ష్మి, సింహాచలం మాట్లాడారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. వారి భవిష్యత్ బడిలోనే కానీ పనిలో కాదని హితవు పలికారు. మధ్యలో బడి మానేసిన వారెవరైనా ఉంటే కమిటీ సభ్యులైన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఎన్యూమరేటర్లకు తెలియజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, గంగాధర్, మల్లేశ్వరరావు, ఎన్యూమరేటర్లు భూలక్ష్మి, ప్రకాష్, కె.వి.మహాలక్ష్మినాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి


ఎంపీడీవో శేషుబాబు

కశింకోట : గ్రామాల్లో ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో కె. శేషుబాబు తెలిపారు. ఇక్కడ శనివారం విలేకరులతో మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు, ఇతర పింఛన్లు కలిపి 10,484 ఉన్నాయన్నారు. వీటి పంపిణీకి రూ.6.98 కోట్లు మంజూరయ్యాయన్నారు వీటిలో వికలాంగులకు రూ.6 వేలు, మిగిలిన వారికి రూ.4 వేలతో పాటు ఎరియర్స్‌తో కలిపి ఏడు వేల రూపాయల వంతున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎక్కడికక్కడే సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలను పంపిణీకి నియమించామన్నారు. వీరు ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్మును జులై 1న అందజేస్తారని తెలిపారు. ఇంకా మిగిలి ఉంటే వారికి మరుసటి రోజు అందజేస్తారన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి


ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న నాయకులు

నర్సీపట్నం: ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. జ్వరాల బారినపడి పట్టణ ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వారిని శనివారం నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతోపాటు మంచినీటి సరఫరా అధ్వానంగా ఉందన్నారు. దీనిపై అధికార యంత్రాంగం దృష్టి సారించాలన్నారు. ప్రజలకు కనీస అవసరాలను తక్షణమే పునరుద్ధరించాలన్నారు.. ఆయన వెంట నాయకులు అడిగర్ల రాజు, సూర్యప్రభ, చిరంజీవి తదితరులు ఉన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు మినరల్ వాటర్ సదుపాయం

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లికి చెందిన ప్రొక్లయిన్ యూత్ అధ్యక్షుడు మళ్ల రాజేష్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు తాగేందుకు మినరల్ వాటర్ సదుపాయం లేకపోవడాన్ని గుర్తించారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే తాగే మంచినీరు కూడా శుద్ధమైనది కావాలని ఇందుకోసం తన వంతుగా హైస్కూల్ విద్యార్థులకు అవసరమయ్యే మంచినీటి క్యాన్‌లను శనివారం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. హైస్కూల్ హెచ్ఎం రత్నరాజుకు క్యాన్‌లు అందజేశారు. ప్రతి రోజు మినరల్ వాటర్ తాగేలా తగు చర్యలు తీసుకుంటామని రాజేష్ ముందుకు రావడం పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.